క్లుప్తంగా

అన్నదాన ట్రస్టుకు రూ.10,101 విరాళం



దాత శ్రీనివాసరావు దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన ట్రస్టు కోసం గ్రామానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసరావు, అనంతలక్ష్మి దంపతులు రూ.10,101 విరాళం ఇచ్చారు. సదరు మొత్తాన్ని ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

నవోదయ విద్యార్థుల ప్రతిభ



సుహితా ఏంజెల్



విశాలాక్షి భవ్య

యానాం: 10, 12 తరగతుల వార్షిక పరీక్షల్లో యానాం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు మంగళవారం తెలిపారు. 10వ తరగతి విద్యార్థిని సుహితా ఏంజెల్ 98.40 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 12వ తరగతిలో కర్రి విశాలాక్షి భవ్య 91.80 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయలు, సిబ్బంది అభినందించారు.

డీఏ పెంచుతూ ఉత్తర్వుల జారీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ క్యాజువల్ లేబర్‌కు డీఏను పెంచుతూ ఆర్థికశాఖ కార్యదర్శి ఎస్.శివకుమార్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు ఇప్పటికే రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు డీఏను 46 శాతం నుంచి 50 శాతం వరకూ పెంచారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఈ డీఏ అమల్లోకి వస్తుందన్నారు. రూ.13,140 ఉన్నవారికి ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి రూ.13,500 వస్తుందన్నారు. ఈ మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ అండ్ ట్రెజరీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

డిపార్ట్‌మెంట్ టెస్ట్‌ల్లో పారదర్శకత లోపించింది

సిటింగ్ ఎంపీ వైతిలింగం

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో వివిధ ప్రభుత్వ శాఖల్లో యూడీసీలుగా విధులు నిర్వహిస్తున్న వారికి అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించేందుకు నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో పారదర్శకత లోపించిందని సిటింగ్ ఎంపీ వైతిలింగం ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. కొంతమంది జూనియర్లు సైతం పదోన్నతి పొందారన్నారు. మొత్తం పదోన్నతి ప్రక్రియకు సంబంధించి మెరిట్‌జాబితా, మార్కులు సైతం పబ్లిష్ చేయాలని, లేదంటే తాము సీబీఐ విచారణ కోరతామన్నారు. గత మూడేళ్ల బీజేపీ, ఎన్‌ఆర్ కాంగ్రెస్ కూటమిలో పాలన సరిగా లేదన్నారు.

ఐఎఫ్‌ఎస్ అధికారి అరుళ్ పర్యటన



మడ అడవులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

యానాం: పుదుచ్చేరి కన్జర్వేషన్ ఫారెస్ట్ అధికారి అరుళ్‌రాజన్ మంగళవారం యానాంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా యానాం సరిహద్దుల నిర్ణయంతో పాటు గౌతమీగోదావరి నదీ ముఖద్వారంలో ఉన్న మాంగ్రూవ్ ఫారెస్ట్ ద్వారా ఎకో టూరిజమ్ అభివృద్ధికి గల అవకాశాలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన యానాం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ప్రత్యేక బోటులో వెళ్లి గోదావరిలో మడఅడవులను పరిశీలించారు. అర్బన్ ప్లానిటేషన్‌కు గల అవకాశాలను గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీడీ శివసుబ్రహ్మణ్యన్, వ్యవసాయ అధికారి జోగిరాజు, ఫీల్డ్ సిబ్బంది ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

మామిడికుదురు: నగరం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో సుమారు 346 మందికి ఉచితంగా వైద్య సేవలందించి, మందులు అందజేశారు. వేసవి కాలంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏడుకొండలు, ఏఎన్ఎంలు ఎం.సునీత, కె.చంద్రకుమారి, పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లు.. చూపుడు వేలితో శాసించారు

- అమలాపురం నియోజకవర్గంలో 82.38 శాతం ఓటింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న 1,75,890 మంది ఓటర్లు
- గతం కంటే 8 శాతం పెరిగిన ఓటింగ్
- రాత్రి 9 గంటలైనా క్యూలో నిలుచుని ఓటేసిన ప్రజలు



అమలాపురం జవహర్‌లాల్‌నెహ్రూ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



చెయ్యేరులో ఓటేసేందుకు వృద్ధురాలిని వీల్ చైర్‌లో తీసుకెళుతున్న యువకుడు

అమలాపురం టౌన్: ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. పల్లె, పట్టణమన్న తేడా లేకుండా ఓటర్లంతా సోమవారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. అనేక పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల నుంచి 9 గంటలైనా ఓటర్లు ఓర్పు కోల్పోకుండా వేచి ఉండి ఓటేసి చూపుడు వేలితో ఫలితాన్ని శాసించారు. అమలాపురం నియోజకవర్గంలో 2019లో జరిగిన ఎన్నికల కంటే ఈ దఫాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదు కావడం విశేషం. యువత, మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో ఓటేసేందుకు ముందుకు రావడం వల్లే భారీ స్థాయిలో పోలింగ్ నమోదైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అమలాపురం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 74.05 శాతం ఓట్లు పోలైతే ఈ ఎన్నికల్లో మరో 8 శాతం పెరిగి 82.38 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకర్గంలో మొత్తం ఓటర్లు 2,13,508 మంది ఉంటే వీరిలో 1,75,890 మంది ఓటర్లు పోలింగ్ బూత్‌ల బాట పట్టినట్లు లెక్క తేలింది. వీరిలో మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లే కాస్త ఎక్కువ. మొత్తం 2,13,508 మంది ఓటర్లలో పురుషులు 1,06,268 మంది ఉంటే మహిళలు 1,07,239 మంది ఉన్నారు. ఒకే ఒక ట్రాన్స్‌జెండర్ ఓటు ఉంది. మొత్తం ఓటింగ్ పరంగా పురుషుల ఓట్ల కంటే మహిళా ఓటర్లు వెయ్యి మంది వరకూ ఎక్కువ ఉన్నారు. ఈ ఎన్నికల్లో పోలైన 1,75,890 ఓట్లలో పురుషులు 89,025 మంది ఓట్లు వేస్తే మహిళలు 86,864 మంది ఓట్లు వేశారు. ఒకే ఒక ఓటుగా ఉన్న ట్రాన్స్ జెండర్ ఓటు కూడా పడింది.

ఈ చైతన్యం దేనికి సంకేతం?

నియోజకవర్గంలో ఎనిమిది శాతానికి పైగా పెరిగిన ఓటింగ్ శాతం పరిశీలిస్తే ఆ ఓట్లు ఎక్కువగా యువ, మహిళలు, వృద్ధులవేనని తేటతెల్లమవుతోంది. ఎందుకంటే పోలింగ్ బూత్‌లకు ఓటు వేసేందుకు వచ్చిన వారిలో గతం కంటే ఎక్కువ మంది మహిళలు, వృద్ధులే ఉండడంతో ఆ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు నేరుగా కుటుంబాలకు లబ్ధి చేకూర్చడంతో కులాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా మహిళలు విధేయతతో వైఎస్సార్ సీపీకి ఓటు వేశారన్న కామెంట్ సర్వత్రా వినిపిస్తోంది. అలాగే నెలా నెలా ఒకటో తేదీన తెల్లవారుతుండగానే వలంటీర్లు ఇంటి తలుపులు తట్టి మరీ వృద్ధాప్య పింఛన్ల సొమ్ము చేతిలో పెడుతున్న సానుకూల పరిణామం కూడా వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు రప్పించిందన్న అభిప్రాయం అందరి నుంచి వ్యక్తమవుతోంది. పైగా టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల్లో కోత తప్పదన్న భయం ప్రజల్లో నెలకొనడం సైతం ఓటింగ్ పెరగడానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

క్రమేపీ పెరిగిన ఓటింగ్ శాతం

నియోజకవర్గ ఓటర్లు ఎండ వేడిమికి జడిసి ఉదయం, సాయంత్రం వేళ పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి కచ్చితంగా ఓటు వేయాలనే తపన ఉన్నా ఎండ తీవ్రత వల్ల సాయంత్రానికి వాయిదా వేసుకున్నారు. దీంతో సాయంత్రం నుంచి నియోజకవర్గంలోని 235 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళి క్రమేపీ పెరుగుతూ వచ్చింది. 235 కేంద్రాల్లో దాదాపు 12 కేంద్రాల్లో అయితే రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకూ కూడా పోలింగ్ ప్రక్రియ జరిగింది. అల్లవరం మండలం మొగళ్లమూరు, బెండమూర్లంక, ఓడలరేవు తదితర పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకూ పోలింగ్ జరిగింది. అమలాపురం మండలం నడిపూడి పోలింగ్ కేంద్రంలో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ సాగింది. నిర్దేశిత పోలింగ్ ముగింపు సమయమైన సాయంత్రం 6 గంటలకు ఎంత మంది ఓటర్లు క్యూలో ఉంటే అంత మందికి అధికారులు టోకెన్లు అందించి వారికి ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించడంతో ఓటింగ్ శాతం పెరుగుదలకు కారణమైంది. సాయంత్రం ఆరు గంటలకు 80 శాతం వరకూ ఓటంగ్ జరిగితే రాత్రి సమయంలో కొన్ని బూత్‌ల్లో జరిగిన ఓటింగ్‌తో 82.38 శాతానికి అంటే మరో రెండు శాతానికి పెరిగినట్లయింది. మొత్తం మీద నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కంటే ఓటింగ్ శాతం పెరగడానికి మహిళలు, వృద్ధుల పరంగా వైఎస్సార్ సీపీకి ఉన్న సైలెంట్ ఓటింగే ప్రధాన కారణమని నియోజక వర్గంలోని రాజకీయ ప్రముఖులు అంచనా వేస్తున్నారు.

అమలాపురం నియోజకవర్గంలో పోలింగ్ సరళి

సమయం	పోలింగ్ శాతం
ఉదయం 9 గంటలకు	11.27 శాతం
ఉదయం 11 గంటలకు	28.24 శాతం
మధ్యాహ్నం ఒంటి గంటకు	46.77 శాతం
మధ్యాహ్నం 3 గంటలకు	61.44 శాతం
సాయంత్రం 4 గంటలకు	62.75 శాతం
సాయంత్రం 5 గంటలకు	72.33 శాతం
పోలింగ్ ముగిసే సమయానికి	82.38 శాతం

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల ప్రారంభం



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మార్చ్ ఫాస్ట్ చేస్తున్న యానాం క్రీడాకారులు



పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించిన స్వాతి



లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించిన ప్రసాద్

సత్తా చాటిన యానాం క్రీడాకారులు

యానాం: ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ 2023–24 పోటీలు మంగళవారం పుదుచ్చేరిలో ప్రారంభమయ్యాయి. ముందుగా యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి నాలుగు రీజియన్లలో 8 జోన్‌లకు చెందిన 640 మంది క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రియదర్శిని, పుదుచ్చేరి స్పోర్ట్స్ సెక్రటరీ అమర్‌నాథ్ తదితరులు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. తొలి రోజు పోటీల్లో యానాం క్రీడాకారులు సత్తా చాటారని స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ తెలిపారు. యానాంకు చెందిన స్వాతి అండర్–17 బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం సాధించారన్నారు. అండర్–19 బాలుర విభాగంలో లాంగ్ జంప్‌లో బాబిప్రసాద్ ప్రథమ స్థానం, హైజంప్‌లో ప్రేమ్ రక్షిత్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారన్నారు.

ఓటింగ్ సరళిపై ఎవరి లెక్కలు వారివే



ముమ్మిడివరంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు

గెలుపోటముల అంచనాల్లో మునిగి తేలుతున్న నేతలు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో ఓటర్ల తీర్పు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉంది. అయితే ఓట్ల లెక్కింపునకు మరో 20 రోజుల వ్యవధి ఉండటంతో అన్ని పార్టీల నాయకులు బూత్‌లు, గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన పోలింగ్ సరళిపై అంచనాల్లో మునిగి తేలుతున్నారు. ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు పోలయ్యాయి.? ఆ బూత్‌లో ఏ ఏ సామాజిక వర్గాల వారు ఎంతెంత మంది? ఎవరెవరికి ఎన్నేసి ఓట్లు పడి ఉంటాయన్న అంశాలపై లెక్కలు వేసుకుంటున్నారు.

83.48 శాతం ఓటింగ్ నమోదు

ముమ్మిడివరం నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో 83.48 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 2,45,296 మంది ఓటర్లు ఉండగా 2,04,768 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో 1,03,292 మంది పురుషులు, 1,01,476 మంది మహిళలు ఉన్నారు. అదే 2019 ఎన్నికల్లో 83.77 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఉన్న ఆదరణ, అన్ని సామాజికవర్గాల మద్దతు తమ గెలుపునకు దోహద పడుతుందని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల 4వ తేదీనే ఓటర్ల తుది తీర్పు తేలనుంది.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి



అమలాపురం ఏరియా అసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగమల్లేశ్వరరావు

అమలాపురం రూరల్: ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తపై సర్పంచ్ భర్త దాడి చేసిన ఘటన బండారులంకలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. తాలుకా ఏఎస్ఐ గోపాలకృష్ణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం బండారులంక శివాలయం వద్ద గల పోలింగ్ బూత్ నెంబర్–11లో సైకిల్ గుర్తుపై ఓటు వేయాలంటూ ఓటర్లను ప్రలోభ పెడుతున్న సర్పంచ్ పెనుమాల సునీతను వైఎస్సార్ సీపీ కార్యకర్త సరెళ్ల నాగమల్లేశ్వరరావు అడ్డుకున్నారు. దాంతో అక్కడ కొద్దిసేపు గందరగోళం చోటుచేసుకుంది. అనంతరం మోటార్ సైకిల్‌పై వెళుతున్న నాగమల్లేశ్వరరావును ఎన్‌కౌంటర్ బ్రిడ్జి సమీపంలో సర్పంచ్ భర్త పెనుమాల ఏడుకొండలు అడ్డగించి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గాయపడిన నాగమల్లేశ్వరరావు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాగమల్లేశ్వరరావు ఫిర్యాదు మేరకు సర్పంచ్ భర్త ఏడుకొండలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గోపాలకృష్ణ తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సమాఖ్య అధ్యక్షుడు దుర్గాప్రసాద్

మామిడికుదురు: అప్పనపల్లిలో సిక్స్ ఎ సైడ్ క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గ్రామ ప్రముఖులు గెద్దం వెంకటేశ్వరరావు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ పోటీల్లో విన్నర్‌కు రూ.16 వేలు, రన్నర్‌కు రూ.13 వేలు నగదు ప్రోత్సాహాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. పలు జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. నయినాల కాశీ, రాజ్ కిష్వర్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి కల్యాణ మహోత్సవాలు



భూసమేత వేంకటేశ్వర స్వామివారు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు, వేద పండితులు వాడపల్లి గోపాలాచార్యులు నేతృత్వంలో ఈ నెల 19న అంకురార్పణ, ధ్వజారోహణ, రాత్రి 7 గంటలకు స్వామివారి పరిణయ మహోత్సవం జరుగుతాయన్నారు. 20న కొతాయి ఉత్సవం, 21న సదస్యం, 22న రథోత్సవం, 23న పూర్ణాహుతి, చక్రస్నానం, సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ, 24న శ్రీపుష్పయాగం, పవలింపు సేవ, కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా 26వ తేదీన అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీ బుధవారం స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో పూర్ణాభిషేకం జరుపుతామని అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

సాగర తీరం.. సంధ్యా సమయం..



ఎస్.యానం గ్రామంలోని సముద్ర తీరాన సింధూర వర్ణంతో కనిపిస్తున్న భానుడు

ఉప్పుగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో సముద్ర తీరాన ఉన్న ఉప్పుటేరులో సాయంత్రం సంధ్యా సమయాన భానుడు ఎర్రటి సింధూర వర్ణంలో కనిపించి మురిపించాడు. పగలంతా భగభగలతో తన ప్రతాపాన్ని చూపించిన భానుడు సాయంత్రం సమయంలో చల్లబడి ఒకవైపు నీటిలో మరోవైపు ఆకాశంలో కనిపించి చూపురులకు ఆహ్లాదం పంచాడు. వేసవి సెలవుల రీత్యా సాయంత్రం వేళలో సముద్ర తీరానికి వచ్చిన సందర్శకులను ఈ సుందర దృశ్యం ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా మంగళవారం క్లిక్‌మనిపించింది.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

అయినవిల్లి: ఎస్.పెదపాలెం గ్రామదేవతగా పూజలందుకుంటున్న ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా జరిపారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



రాజోలు విద్యుత్‌శాఖ ఏడీఈకి వినతిపత్రం అందిస్తున్న కాలనీ వాసులు

రాజోలు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సోంపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయ స్వామి వీధి నివాసితులు విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. లోఓల్టేజీ సమస్యతో చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఆంజనేయస్వామి వీధి నివాసితులు బొమ్మిడి వెంకటేష్, తిరుమాని రాజు, బొమ్మిడి భరణికుమార్, నందకిషోర్, సంకరపు పెద్దిరాజు, ఇల్లింగి పెద్దిరాజు తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.

రావణుడిని తలదన్నే బొప్పాయి చెట్టు

కాజులూరు: సర్వసాధారణంగా మనిషికి, బొప్పాయి చెట్టుకి ఒకే తల ఉంటుంది. త్రేతాయుగంలో లంకాధిపతి రావణుడికి 10 తలలు ఉండేవని పురాణాలు చెబుతున్నాయి. అయితే కాజులూరు మండలం మొగలిపాలెంలో ఆ నాటి రావణుడిని తలదన్నేలా ఒక బొప్పాయిచెట్టు 10 తలలు వేసింది. వాటిలో ఐదు తలలు నిండైన కాయలతో చూపరులను ఆకర్షిస్తోంది. తన పెరటిలో పెరిగిన ఈ బొప్పాయిచెట్టు మొదట్లో ఒక్క తలతోనే మొలిచిందని క్రమేపీ 10 తలలు వచ్చాయని రైతు తాడి వెంకట రెడ్డి చెబుతున్నారు. ఈ మొక్కకు ఎటువంటి రసాయన ఎరువులు వేయలేదని ఇంటిలోని చెత్త, సేంద్రియ ఎరువులను ఉపయోగించుకునే పెద్ద పెద్ద కాయలు కాస్తుందన్నారు.

మొగలిపాలెంలో 10 తలలతో పెరిగిన బొప్పాయిచెట్టు



జాషువాకు ఘన నివాళి



కొల్లాబత్తుల జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సఖినేటిపల్లి: రామేశ్వరానికి చెందిన నియోజక వర్గ గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి, కళా కోవిదుడు డాక్టర్ కొల్లాబత్తుల జాషువాకు పలువురు ఘన నివాళులర్పించారు. మంగళవారం రామేశ్వరంలో ఈ మేరకు ఆయన చిత్రపటం వద్ద శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, సింధు కె ప్రసాద్, శ్యాంసన్, పి.శేఖర్, నల్లి నిర్మల్ కుమార్, నల్లి చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో వక్తలు మాట్లాడుతూ, జాషువా మృతి కళా రంగానికి తీరని లోటు అని అన్నారు. మిమిక్రీ ఆర్టిస్ట్‌గా ఆయన మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ జాతర

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత కనక మహాలక్ష్మమ్మ జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవాన్ని ఆద్యంతం కనుల పండువలా జరిపించారు. అమ్మవారికి మంగళవారం భక్తులు నైవేద్యాలు చెల్లించారు. బుధవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని, శుక్రవారం అన్న సమారాధన ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు తెలిపారు. జాతర మహోత్సవం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



హరినాథ్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకుంటేనే తమకు ఆనందంగా ఉంటుందని పెదపట్నంలంక జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం కె.హరినాథ్ పేర్కొన్నారు. మగటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ తమకు విద్య నందించిన హరినాథ్‌కు మగటపల్లి, గోగన్నమఠం, పాన్నమండ గ్రామాలకు చెందిన 2010–11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం సన్మానం చేశారు. హరినాథ్‌కు ప్రశంసాపత్రం అందించి శాలువాలతో సత్కరించారు. ఆయన ఎంతో కష్టపడి తమకు విద్య నేర్పించారని, ఆయన చెప్పిన పాఠాలు చదువుకుని తాము ఉన్నత స్థానాలకు చేరుకున్నామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడు గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.